క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లాలోని తెలంగాణ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో 2022–23 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఇమాముద్దీన్ బుధవారం తెలిపారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, ఈనెల 30లోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎంఆర్ఈఐఎస్.తెలంగాణ.జీవోవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 97059 99215, 73962 42475 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉపకార వేతనాలకు..

నెహ్రూసెంటర్: తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ఉపకార వేతనాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సహాయ కమిషనర్ జగదీశ్‌కుమార్ బుధవారం తెలిపారు. దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంస్థలు, ధార్మిక లేదా ఇతర ట్రస్టుల్లో పని చేస్తున్న కార్మికుల పిల్లలు, కార్మికులకు అవకాశం కలదన్నారు. ఫిబ్రవరి 15 చివరి తేదీ అని, దరఖాస్తు చేసుకుని జిల్లా కేంద్రంలోని జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఆలయ వార్షికోత్సవానికి ఎస్పీకి ఆహ్వానం

కేసముద్రం: కేసముద్రం స్టేషన్‌లో ఈనెల 26 నుంచి 28 వరకు నిర్వహించనున్న శ్రీధర్మశాస్త దేవాలయం ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్‌కు ఆహ్వాన పత్రిక అందించినట్లు అయ్యప్ప అన్నదాన సేవా సొసైటీ కోశాధికారి బోగోజు నాగేశ్వరాచారి, లక్కాకుల సత్యనారాయణ బుధవారం తెలిపారు.

గుండెపోటుతో ఎఫ్‌బీఓ మృతి


కుమారస్వామి (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా అటవీశాఖలోని డోర్నకల్ రేంజ్‌లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న గుడికందుల కుమారస్వామి(56) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ బాలసముద్రంలో నివాసం ఉండే కుమారస్వామి రోజులాగే విధులకు హాజరయ్యాడు. మూత్రశాలకు వెళ్లి అక్కడే కుప్పకూలిపోయాడు. అధికారులు, సిబ్బంది గమనించి చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు కుమారస్వామికి సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎఫ్‌బీఓ కుమారస్వామి మృతి పట్ల డీఎఫ్‌ఓ రవికిరణ్, ఎఫ్‌డీఓ కృష్ణమాచారి, ఇతర అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నెహ్రూసెంటర్: తెలంగాణ రైతు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గునిగంటి రాజన్న, శెట్టి వెంకన్న, నాయకులు మార్తినేని పాపారావు, నల్లపు సుధాకర్, బొబ్బ వెంకట్‌రెడ్డి, జక్కుల మల్లయ్య, మధు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

కురవి: ఫిబ్రవరి 5వ తేదీ నుంచి మండల కేంద్రంలో జరిగే ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుగులోత్ భీమానాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సంఘం సమావేశం జరిగింది. కార్యక్రమంలో తేజావత్ వినోద్, భూక్య రవినాయక్, సురేష్‌నాయక్, రంజిత్‌నాయక్, గణేష్ నాయక్, నవీన్, వీరన్న నాయక్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల కోసం పోరాటం

పెద్దవంగర: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను మరింత మెరుగుపరిచేందుకు పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు చింత నవీన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ రంగాల్లో 20 లక్షల మంది కార్మికులు ఉండగా 8లక్షల మందికి లేబర్‌కార్డులు లేవన్నారు. వారికి కార్డులు వచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

అనధికార క్లబ్‌లను విశ్వసించొద్దు

తొర్రూరు: గుర్తింపు, విశ్వసనీయత లేని అనధికార క్లబ్‌లను విశ్వసించొద్దని వాసవి క్లబ్ జిల్లా ఇన్‌చార్జ్ పి.గౌరీశంకర్ అన్నారు. బుధవారం తొర్రూరులోని విశ్రాంతి భవనంలో తొర్రూరు వాసవి క్లబ్, వనితా క్లబ్‌ల పునరుద్ధరణపై ప్రతినిధులు సమావేశమయ్యారు. అనంతరం వాసవి క్లబ్ తొర్రూరు అధ్యక్షుడిగా వి.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.నవీన్‌కుమార్, కోశాధికారిగా మహేష్, ఉపాధ్యక్షుడిగా అనిల్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

తొర్రూరులో ర్యాలీ నిర్వహిస్తున్న మదర్ వలంటరీ ప్రతినిధులు



బయ్యారంలో విద్యార్థుల ర్యాలీ



గూడూరు ప్రధాన సెంటర్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ



జాతీయ ఓటరు దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా జాతీయ ఓటరు దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. అధికారులు, ఓటర్లు ప్రతిజ్ఞ చేశారు. పలువురు అధికారులు, వక్తలు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఓటు హక్కు వజ్రాయుధమని, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


డోర్నకల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్


గార్లలో అధికారుల ప్రతిజ్ఞ


కురవిలో..


మహబూబాబాద్ అర్బన్: ఓటర్లను సన్మానిస్తూ..


మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లి పాఠశాలలో..


కేసముద్రంస్టేషన్ జెడ్పీఎస్ఎస్‌లో..

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే

- అభివృద్ధి పనుల నిధుల విషయంలో వినతి


మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్: హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ బుధవారం కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు, ఇతర విషయాలపై వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం స్థలం విషయంలో భూములు కోల్పోతున్న గిరిజనులకు న్యాయం చేయాలని, కేసముద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు, మానుకోట మున్సిపాలిటీ సుందరీకరణ పనులకు రూ.10 కోట్లు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ వినతిలోని అంశాలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే, పనుల విషయంలో ఉన్నతాధికారులను సైతం కలిశారు. కార్యక్రమంలో భరత్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, దుర్గేష్, శ్రీను, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యం

మరిపెడ రూరల్: అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్ అన్నారు. మరిపెడ మండలం బుర్హాన్‌పురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కేసీఆర్ సర్కార్ తెచ్చిన ఎన్నో పథకాలు నేడు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రజలు కంటి చూపు కోసం ఇంతటి కార్యక్రమాన్ని దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టలేదన్నారు. కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీపీ గుగులోత్ అరుణ, జెడ్పీటీసీ తేజావత్ శారద, మరిపెడ పీహెచ్‌సీ వైద్యుడు గుగులోత్ రవి, ఎంపీటీసీ మచ్చ ఉమారాణి, బీఆర్ఎస్ నాయకులు మచ్చ వెంకటనర్సు, నలబోలు ప్రవీణ్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మరిపెడ: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్ సూచించారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. కంటి వెలుగు పరీక్షలు చేయించుకున్న అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సుజాతవెంకన్న, సయ్యద్ లతీఫ్, దిగజర్ల శ్రీనివాస్, వృశేన్, భద్రయ్య, మౌలానా, రేఖ లలిత, యాకూబ్, సర్వర్, వహిద్, బషీద్, జాకీర్‌హుస్సేన్, సాధిక్, ఫైజ్‌ఖాన్, జబ్బార్, గోరే మీయా తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు


కంటి పరీక్షలు చేయించుకుంటున్న నవీన్

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. బుధవారం 135 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 12 మందికి కంటి అద్దాలు, 22 మందికి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి ప్రవీణ్, ప్రోగ్రాం ఆఫీసర్ రవితేజ, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, రాధాకుమారి, ఏఎన్ఎంలు నర్సుబాయి, శ్యామల, ఆశాలు జ్యోతి, సైదమ్మ తదితరులు ఉన్నారు.

రైతుబంధు పేరుతో దోపిడీ


మాట్లాడుతున్న రమేష్‌రాథోడ్

డోర్నకల్: రైతుబంధు పేరుతో వందలాది ఎకరాల భూములున్న దొరలు దోచుకుతింటున్నారని ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నియోజకవర్గ పాలక్ రమేష్‌రాథోడ్ ఆరోపించారు. మండలంలోని పెరుమాళ్లసంకీసలో బుధవారం జరిగిన పార్టీ పతాకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో భారత కీర్తి ప్రపంచ దేశాలకు తెలుస్తుందన్నారు. కేసీఆర్ హయాంలో విద్యుత్, మద్యంతో పాటు నిత్యావసరాల ధరలు పెరిగి పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రెడ్యానాయక్ కుటుంబ పాలన సాగిస్తున్నాడని మండిపడ్డారు. నియోజకవర్గ కేంద్రంలో ముప్పై పడకల ఆస్పత్రిని వంద పడకలకు అప్‌గ్రేడ్ చేస్తానని హామీ నేటికీ అమలు కాలేదన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే రైతుబంధును పది ఎకరాల లోపు ఉన్న రైతులకే వర్తింపజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోత్ లక్ష్మణ్‌నాయక్, నియోజకవర్గ ప్రభారి ఈవీ రమేష్, నియోజకవర్గ కన్వీనర్ పూర్ణచందర్, మండల పార్టీ అధ్యక్షుడు బాసాని నాగేశ్వర్‌రావు, ఊడ్గుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మండమెలిగె


గద్దెల వద్ద మండమెలిగె పూజలు చేస్తున్న దృశ్యం

గూడూరు: మండలంలోని దామరవంచ జాతీయ రహదారి పక్కన అటవీ ప్రాంతంలో చింతలగట్టు వట్టివాగు సమీపంలో వెలసిన శ్రీ సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద మినిజాతర ఏర్పాట్లలో భాగంగా బుధవారం మండమెలిగె పూజలు నిర్వహించారు. జాతర కమిటీ ప్రతినిధులు, పూజారులు సంప్రదాయం ప్రకారం మచ్చర్ల గ్రామం నుంచి పసుపు, కుంకుమ, అడవి పూలు, పూజా సామగ్రితో డప్పు, డోలు వాయిద్యాల మధ్య గద్దెల వద్దకు చేరుకున్నారు. వారికి తహసీల్దార్ అశోక్‌కుమార్ దంపతులు స్వాగతం పలికారు. ఆ తరువాత గద్దెల చుట్టూ శుభ్రం చేసి మకర తోరణాలు కట్టి, గద్దెల పైకి తల్లులుగా కొలిచే పసుపు, కుంకుమ, పూలను చేర్చారు. పసుపు తలంబ్రాలతో తల్లులు కొలువుదీరినట్లు పూజలు చెప్పారు. జాతర కమిటీ ప్రతినిధులు పెనక నాగయ్య, వాసం భద్రయ్య, సాంబరాజు, జనార్దన్, వీరస్వామి, సహదేవులు, పూజారులు దారం సిద్ధు, తాటి సుధాకర్, కారం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

‘తుపాకులగూడెం’ను ఆదరించాలి


మాట్లాడుతున్న హీరో శ్రీకాంత్ రాథోడ్

డోర్నకల్: జాబ్ స్కామ్‌ను కథాంశంగా తీసుకుని సందేశాత్మకంగా రూపొందించిన రెబల్స్ ఆఫ్ తుపాకులగూడెంను ప్రేక్షకులు ఆదరించాలని సినిమాలో ఓ హీరోగా నటించిన శ్రీకాంత్ రాథోడ్ కోరారు. వారధి క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణంలో జయదీప్ విష్ణు దర్శకత్వంలో శ్రీకాంత్ రాథోడ్, ప్రవీణ్ కండెల హీరోలుగా రూపొందించిన ఈ సినిమా ఫిబ్రవరి 3న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా డోర్నకల్‌లో బుదవారం హీరో శ్రీకాంత్ రాథోడ్ విలేకరులతో మాట్లాడారు. సీనియర్ సంగీత దర్శకుడు మణిశర్మ సంగీతం అందించగా కాసర్ల శ్యాం మూడు పాటలు రాశారని తెలిపారు. సినిమాను థియేటర్లలో మాత్రమే చూడాలని కోరారు.

నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలు పెంచాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ బాధ్యులు

గూడూరు: రాష్ట్ర వ్యాప్తంగా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలను పెంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బిళ్లకంటి సూర్యం డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ 30న తలపెట్టిన చలో హైదరాబాద్ ఎస్‌పీడీ ఆఫీస్ ముట్టడి కోసం ముద్రించిన గోడ పత్రికలను మండలంలోని బ్రాహ్మణపల్లి కేజీబీవీ ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయకుండా వెట్టిచాకిరి చేయించుకుంటుందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రతిఒక్కరికి రూ.26 వేల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, సిబ్బంది మీరాబాయి, పాపమ్మ, స్వరూప, నీలమ్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పోలీసుల తనిఖీలు

మహబూబాబాద్ రూరల్: గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు బుధవారం జిల్లా కేంద్రంలో విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఎన్టీఆర్ స్టేడియం, రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, మదర్‌థెరిస్సా సెంటర్, నెహ్రూ సెంటర్ ప్రాంతాల్లో తనిఖీలు జరిగాయి. ఆర్ఐ అడ్మిన్ నర్సయ్య, పీసీలు అంజయ్య, రామయ్య, మహేష్ పాల్గొన్నారు.

ఈ–శ్రామ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నెహ్రూసెంటర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ–శ్రామ్ పథకాన్ని అసంఘటిత రంగ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కార్మిక శాఖ జిల్లా సహాయ కమిషనర్ పి.జగదీశ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈఎస్ఐ, ఈపీఎఫ్, ఆదాయ పన్ను కట్టనివారు, రోజువారి కార్మికులు, వ్యవసారంగ కార్మికులు, హమాలీలు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా కాపీ ద్వారా ఉచితంగా నమోదు చేసుకోవచ్చన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

నెహ్రూసెంటర్: అంగన్‌వాడీ, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం(రేపు) జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్, కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ పిలుపునిచ్చారు. సంఘం పట్టణ కమిటీ సమావేశం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో బుధవారం జరిగింది. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగన్న, శ్రీను, శ్యాం పాల్గొన్నారు.

కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి

గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని చంద్రగిరి దీప్తిమాధురి జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో.. బేటీ పడావో వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ శశాంక చేతుల మీదుగా బహుమతి, ప్రశంస పత్రం అందుకుంది.

ఎమ్మెల్యేను విమర్శించే హక్కు లేదు..

గార్ల: ఇల్లందు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వర్గీయులు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియను విమర్శిస్తున్నారని, ఎమ్మెల్యేను విమర్శించే హక్కు వారికి లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నుంచి టీఆర్ఎస్ పార్టీలోకి మారలేదా అని ఆయన ప్రశ్నించారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రమేష్, కోఆప్షన్ సభ్యుడు ఖదీర్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నాయకుల చిత్రపటాల అందజేత

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు ఓరుగంటి వేణుబాబు జ్ఞాపకార్థం అతడి కుటుంబ సభ్యులు బుధవారం జాతీయ నాయకుల చిత్రపటాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేందర్, నర్సయ్య, పీఈటీ రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు క్షమాపణ చెప్పాలి

మరిపెడ: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మహబూబ్‌నగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులపై బీజేపీ నాయకులు దాడి చేయడం అమానుషమని, బీజేపీ నాయకులు ఎమ్మార్పీఎస్ నాయకులకు క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేష్ మాదిగా డిమాండ్ చేశారు. బుధవారం మరిపెడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ కోరుతూ ఫిబ్రవరి 12న విజయవాడ–హైదరాబాద్ హైవే దిగ్బంధం చేస్తామని చెప్పారు.

సన్మానం

మహబూబాబాద్ అర్బన్: సిద్దిపేట జిల్లాల్లో ఇటీవల నిర్వహించిన 5 కిలోమీటర్ల రన్నింగ్, వాకింగ్ పోటీల్లో మానుకోట ఉషోదయ వాకర్ అసోసియేషన్ సభ్యుడు మహంకాళి వెంకటేశ్వర్లు పాల్గొని డబుల్ గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో అతడిని ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య, సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ కోశాధికారి తండా సదానందం, ఉపాధ్యక్షులు నల్లు సుధాకర్‌రెడ్డి, కల్లెం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పదోన్నతుల ధ్రువపత్రాల పరిశీలన


ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు

మహబూబాబాద్ అర్బన్ : ప్రధానోపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన ధ్రువపత్రాలను మానుకోట ప్రభుత్వ బాలుర పాఠశాలలో మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియారిటీకి ఇబ్బంది కలగకుండా, అన్ని కేటగిరీల ధ్రువపత్రాలను క్షుణంగా పరిశీలిస్తామని.. బదిలీలు, పదోన్నతులు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఈఓ పి.రామారావు, కోఆర్డినేటర్లు, సదయ్య, సుధాకర్, ముకేష్, జిల్లా పరిశీలకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

నెహ్రూసెంటర్: కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని రైతు సంఘాల సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో గుజ్జు దేవేందర్ అధ్యక్షతన రైతు సంఘాల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల పోరాట ఫలితంగా రద్దు చేసిన రైతు వ్యతిరేక నల్లా చట్టాలను మరో రూపంలో అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నేడు జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ నుంచి ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహిస్తున్నామని.. రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకన్న, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి వీరన్న, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె బాబు, జిల్లా నాయకులు యాకన్న, రాజన్న, పాషా, సుధాకర్, పాపారావు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్యులను నియమించాలి

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు, గార్ల మండలాల్లోని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను నియమించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్ కలెక్టర్ శశాంకను కోరారు. ఈ మేరకు బుధవారం వినతిపత్రం అందజేశారు. గూడూరు సీహెచ్‌సీలో 16 మంది వైద్యులకు నలుగురు మాత్రమే ఉన్నారన్నారు. భరత్, రంజిత్‌రెడ్డి, దినేస్‌కుమార్, రవి పాల్గొన్నారు.

బైక్ పైనుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

దంతాలపల్లి: దంతాలపల్లి పోలీస్‌స్టేషన్ ఎదురుగా బుధవారం రాత్రి ఓ వ్యక్తి బైక్ పైనుంచి పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. నెల్లికుదురు మండలం బ్రాహ్మణకొత్తపల్లికి చెందిన పిడుగు ఉప్పలయ్య దంతాలపల్లి మండల కేంద్రంలో గల అత్తగారింటికి వెళ్తే క్రమంలో బైక్ అదుపుతప్పి పడిపోయాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

వెదురు తరలిస్తున్న ఎడ్ల బండ్లు స్వాధీనం

కొత్తగూడ: కొత్తగూడ మండలం ఓటాయి అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా వెదురు బొంగు తరలిస్తున్న మూడు ఎడ్ల బండ్లను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వజ్రహత్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టి మూడు ఎడ్ల బండ్లను స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సుఖ ప్రసవాలు


కేసీఆర్ కిట్ అందజేస్తున్న రవికుమార్

మరిపెడ: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సుఖప్రసవాలు జరుగుతాయని మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గుగులోత్ రవికుమార్ అన్నారు. పీహెచ్‌సీలో డెలవరీ అయిన బాలింతకు బుధవారం కేసీఆర్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రైవేట్ ఆస్పత్రులకంటే మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ కోటేశ్వరి, స్టాఫ్ నర్స్ సుహాసిని, ఏఎన్ఎం సరళ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.